


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 9-9-2024

సంపుటి: 20 సంచిక: 142
పేజీలు: 4 వెల: రూ.1




# ప్రశ్నిస్తే పీకేస్తారా?!

- రాష్ట్ర కాంగ్రెస్ నియామకాల్లో షర్మిల నియంతృత్వ ధోరణి
- పార్టీని బతికిస్తున్న వారినే పాతరేశారని ఆగ్రహం
- శ్రీకాకుళం జిల్లాతోపాటు రాష్ట్రస్థాయిలో పలువురికి అన్యాయం
- పనికిమాలినవారికి పదవులు కట్టబెట్టారని శ్రేణుల అసంతృప్తి
- పీసీసీ అధ్యక్షురాలు సొంత అజెండా అమలు చేస్తున్నారని ఆరోపణలు



'హౌ ఆర్ యు డాక్టర్ కిల్లి? డూ యూ హేవ్ ఎనీ పోస్ట్ ఇన్ అవర్ పార్టీ?' ఇదీ కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఆమధ్య కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీని కలిసినప్పుడు ఎదురైన మొదటి ప్రశ్న. కృపారాణి కలిసింది సోనియాగాంధీని మాత్రమే కాదు.. రాహుల్ గాంధీని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను, కర్ణాటక ఉపముఖ్యమంత్రి శివకుమార్‌ను కలిసినప్పుడు కూడా ఆమెకు ఎదురైన ప్రశ్న ఇదే. పుట్టింటికి వచ్చిన కృపారాణిని గౌరవించాలన్నదే కాంగ్రెస్ అగ్రనేతల భావన. సీన్ కట్ చేస్తే.. ఆదివారం షర్మిల ప్రకటించిన పీసీసీ కార్యవర్గ జాబితాలో ఆమె పేరు లేదు.



బొడ్డేపల్లి సత్యవతి.. వరుసగా రెండుసార్లు ఆమదాలవలస ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏకైక మహిళ. డీసీసీ అధ్యక్షురాలిగా సుదీర్ఘ కాలం పని చేశారు. వయసు, కుటుంబ కారణాల రీత్యా గతంలో ఆమెను ఆ పదవి నుంచి తప్పించినా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించారు. తీరా చేస్తే.. షర్మిలమ్మ జాబితాలో ఆమె పేరు భూతద్దం పెట్టి వెతికినా కనపడలేదు.



కేవలం పది నెలలు డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన పేడాడ పరమేశ్వరరావు స్థానిక ఇందిరా విజ్ఞాన్‌భవన్‌కు ఒక అఫీషియల్ బ్యాంక్ అకౌంట్‌ను ఓపెన్ చేశారు. ఇందులో ప్రతి ఆర్థిక లావాదేవీని నమోదు చేశారు. అలా సమకూరిన రూ.10 లక్షలను పీసీసీ ఖర్చుల కోసం ఇక్కడి నుంచి పంపించారు. ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కార్యకర్తలే లేకపోయినా ఈ రెండుచోట్లా గత ఎన్నికల్లో అభ్యర్థులను నిలిపే స్థాయికి కాంగ్రెస్‌ను పరుగెత్తించారు. కానీ.. పేడాడ పరమేశ్వరరావుకు సైతం షర్మిలమ్మ టీమ్‌లో స్థానం దక్కలేదు.



– సత్యంన్యూస్, శ్రీకాకుళం

పైన చెప్పుకున్నవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. కాంగ్రెస్ సంప్రదాయాన్ని పూర్తిగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పూర్తిగా తుంగలో తొక్కేశారు. తనను ప్రశ్నించేవారిని, తనపై ఫిర్యాదు చేసేవారిని తొక్కిపెట్టే ప్రయత్నంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఎందుకూ కొరగాని టీమ్‌ను నియమించుకున్నారు. డీసీసీ అధ్యక్షుడిగా శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన అంబటి కృష్ణారావును నియమిస్తూ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎన్నికల్లో జిల్లాలో మిగిలిన కాంగ్రెస్ అభ్యర్థుల కంటే కృష్ణకు కొద్దిపాటి ఓట్లు ఎక్కువ వచ్చిన మాట వాస్తవం. అంతమాత్రాన ఆయన జనామోదం ఉన్న నాయకుడు కాదు. దీనికి తోడు ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు సంబంధించి అనేక ఆరోపణలు ఆయన పై ఉన్నాయి. ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో దాదాపు కోటి రూపాయలకు సంబంధించి బ్యాంకుతో గొడవ ఉందని ఆయనే స్వయంగా పేర్కొన్నారు. ఇది కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని చెప్పుకునే అంబటి కృష్ణకు బయట కూడా అనేక ఆర్థిక వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇలాంటి వ్యక్తిని తీసుకువచ్చి డీసీసీ అధ్యక్షుడిగా షర్మిల నియమించారు. పోనీ ఆయన వ్యాపారం.. ఆయన ఇష్టం అని భావించినా సామాజికవర్గాల సమీకరణను కూడా షర్మిల ఎక్కడా పట్టించుకోలేదు. దీంతో జిల్లాలో కాంగ్రెస్ సానుభూతిపరులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీలు గుర్రుగా ఉన్నారు. డీసీసీ అధ్యక్షుడిని నియమించేటప్పుడు కనీసం తమను సంప్రదించకపోవడం అన్యాయమని వారంతా భావిస్తున్నారు. వాస్తవానికి జిల్లా కాంగ్రెస్ కమిటీకి సేవలందించినవారిని ఆ పదవుల నుంచి తప్పిస్తే రాష్ట్రస్థాయిలో ఏదో ఒక పదవి ఇవ్వడం కాంగ్రెస్ ఈరోజు వరకు బతికుండటానికి ప్రధాన కారణం. శ్రీకాకుళం జిల్లానే ఉదాహరణగా తీసుకుంటే డీసీసీ అధ్యక్షురాలిగా బొడ్డేపల్లి సత్యవతిని తప్పించిన తర్వాత ఆమెకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చారు. కానీ మొన్నటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న సనపల అన్నాజీరావును తప్పించిన షర్మిల తాజా కార్యవర్గంలో ఆయన్ను ఎక్కడా – మిగతా 4లో




# నాయనా.. బాబూ'రావా'!

- విధులకు డుమ్మా కొడుతున్న డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో
- ఆయన గైర్హాజరీతో ఫైళ్లు, ఇతర పనులన్నీ పెండింగ్
- అక్రమ వ్యవహారాలకే ప్రాధాన్యం.. ముఖం చూపించి వెళ్లిపోతున్న వైనం
- మంత్రి అచ్చెన్నాయుడు మందలించినా మారని తీరు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**'బాబూ.. నువ్వెక్కడున్నా తొందరగా రా నాయనా! నీ కోసం ఇక్కడ అందరూ బెంగ పెట్టుకున్నారు. నువ్వు లేకపోవడం వల్ల, నువ్వు రాకపోవడం వల్ల ఏం చేయాలో మాకు తోచడంలేదు. నువ్వెక్కడున్నా అర్జంటుగా రావాలని కోరుకుంటున్నాం.'**

..ఇది తప్పిపోయిన చిన్నపిల్లాడి కోసం తల్లిదండ్రులు ఇచ్చిన ప్రకటన కాదు. స్వయంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న బాబూరావు కోసం సంబంధిత కార్యాలయ ఉద్యోగులు రోజూ ఫోన్లు చేసి బతిమాలి మరీ ఆఫీసుకు రప్పిస్తున్న కథ ఇది. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న బాబూరావు రెగ్యులర్‌గా కార్యాలయంలో ఉండరు. ఒకవేళ ఉండక తప్పని పరిస్థితి వస్తే కొద్ది గంటలు మాత్రం సీట్లో కూర్చుని వెళ్లిపోతారు. ఏవోయే అన్ని ఫైళ్లపై సంతకాలు చేయాల్సి ఉండటంతో ఆయన్ను వెతికి పట్టుకుని కార్యాలయానికి రప్పించడానికి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు నానా తిప్పలు పడుతున్నారు. ఆయన కార్యాలయంలో సక్రమంగా ఉండటం లేదని 'సత్యం'కు ఉప్పందిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లి చూడగా.. డ్యూటీ అవర్స్‌లో ఆయనగారు కనిపించలేదు.

## వసూలు, సెటిల్‌మెంట్లపైనే దృష్టి

రిమ్స్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింటెండెంట్‌గా బాబూరావు పని చేసిన కాలంలో డయాలసిస్ యూనిట్‌కు సంబంధించి 12 అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేశారు. ఈ సమయంలో అభ్యర్థుల నుంచి సొమ్ము వసూలుచేసే బాధ్యతను బాబూరావు ఒక మధ్యవర్తికి అప్పజెప్పారట. ఆ మేరకు డయాలసిస్ అసిస్టెంట్ల నుంచి సొమ్ము దండేసిన సదరు మధ్యవర్తి దాన్ని బాబూరావుకు ఇవ్వకుండా ఎగ్గొట్టడంతో ఆ కలెక్షన్ కోసం బాబూరావు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎఫ్‌ఆర్‌సీ హాజరు వేసేసుకుని ఆయన వెళ్లిపోతున్నట్లు చెప్పుకుంటున్నారు. రిమ్స్‌లో ఉండిపోయిన సొమ్ముల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయ విధులకు ఎగనామం పెడుతున్నారని ఆరోగ్య శాఖ వర్గాలే చెబుతున్నాయి. ఆ మధ్య ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, స్వీపర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 114 మందికి రెండు నెలలుగా జీతాల బిల్లు పెట్టకపోవడంతో వారంతా రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడును కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో అచ్చెన్న తనదైన శైలిలో బాబూరావును పిలిచి క్లాస్ పీకి జీతాలు ఇప్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసి చనిపోయిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాల వారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలివ్వాలని ఫైలు పెట్టారు. కానీ బాబూరావు రెండు నెలలు ఆ ఫైలుపై సంతకం చేయకుండా తాత్సారం చేశారనడానికి ఆధారాలున్నాయి. వీటిలో ఒక్కో పోస్టుకు రూ.2 లక్షలు చొప్పున బేరం పెట్టారని, అది కుదరకపోవడంతో రెండు నెలలుగా వారి నియామకాలను తొక్కిపెట్టేశారని తెలుస్తోంది. దీనిపై బాధితులు కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోవిడ్ టైమ్‌లో ఖర్చు చేసిన రూ.4 కోట్లకు ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. అయితే ఈ ఏడాది మార్చితో బిల్స్ ల్యాప్స్ కావడంతో మళ్లీ కొత్తగా రీ వ్యాలిడేషన్ చేయాల్సి ఉంది. అలా చేయకుండా జూన్‌లో ప్రొసీడింగ్స్ ఇవ్వడం వల్ల ట్రెజరీలో ఈ రూ.4 కోట్ల బిల్లులు ఆగిపోయాయి. వాస్తవానికి అకౌంటెంట్ శివ, ఏవో తాత్సారం చేయడంలో దిట్టలుగా పేరు పొందారు. డీఎంహెచ్‌వో కార్యాలయానికి కూతవేటు దూరంలోనే అకౌంటెంట్ శివ ఇల్లు ఉండటంతో ఆయన అక్కడి నుంచే కార్యాకలాపాలు జరుపుతున్నారు. ఈయనకు ఏవో తోడవడంతో కారుణ్య నియామకాల దగ్గర్నుంచి జీతాల వరకు ఆయన సంతకం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



• ఎడిటోరియల్

## హవ్వ.. గంజాయి సాగుకు చట్టబద్ధతా!

మాదకద్రవ్యాలు సమాజంపై ఎంత దుష్ప్రభావం చూపుతున్నాయో? యువతను ఎంత నాశనం చేస్తున్నాయో? కొత్తగా చెప్పక్కర్లేదు. మాదకద్రవ్యాల్లో(డ్రగ్స్)లో కీలకమైనది గంజాయి. అనేక డ్రగ్స్ తయారీలో ఇదే ముడిసరుకుగా ఉపయోగపడుతోంది. అదే సమయంలో గంజాయిని సిగరెట్లు, చుట్టలు, బీడీల మాదిరిగా కూడా వాడవచ్చు. సమాజానికి హానికరంగా మారిన గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎన్నో కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయి. మనదేశంలోనే కాకుండా అనేక ప్రపంచ దేశాల్లోనూ గంజాయిని నిషేధిత పదార్థంగానే పరిగణిస్తున్నారు. దాన్ని సాగుచేసినా, రవాణా చేసినా, క్రయ విక్రయాలు జరిపినా, సేవించినా తీవ్ర నేరంగా పరిగణించి అరెస్టుచేసి జైల్లో పెడతారు. గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల రవాణా, అమ్మకాలను అరికట్టేందుకు కేంద్ర రాష్ట్రాల స్థాయిలో నార్కోటిక్స్ బ్యూరో వంటి అనేక ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. ఎన్నో కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయి. సమాజం నుంచి కూకటి వేళ్లతో పెకిలించి వేసేందుకు ప్రభుత్వాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. కానీ చిత్రంగా కొన్ని రాష్ట్రాలు మాత్రం గంజాయి సాగును చట్టబద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే మధ్యప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో గంజాయి సాగుపై నిషేధం ఎత్తివేసి మిగతా పంటల్లా సాగు చేసుకునే అవకాశం కల్పించాయి. ఇప్పుడు ఆ జాబితాలో హిమాచల్‌ప్రదేశ్ చేరింది. గంజాయి సాగుకు చట్టబద్ధత కల్పిస్తూ ఆ రాష్ట్ర అసెంబ్లీ కొద్దిరోజుల క్రితమే ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దాంతో ఆ రాష్ట్రంలో గంజాయికి గేట్లు తెరిచినట్లే. అయితే కేవలం ఔషధాల తయారీలో వినియోగానికి, పారిశ్రామిక అవసరాలకే గంజాయి సాగుకు అనుమతి ఇచ్చినట్లు ఆ రాష్ట్ర రెవెన్యూమంత్రి జగ్జిత్‌సింగ్ నేగి ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. దీనికి అనుమతి ఇచ్చే ముందు పెద్ద కసరత్తే చేశామని ఆయన చెప్పుకొచ్చారు. వాస్తవానికి 2022లోనే హిమాచల్‌ప్రదేశ్‌లో గంజాయి సాగుకు అనుమతి ఇవ్వాలన్న ప్రతిపాదనపై ఆ రాష్ట్ర అసెంబ్లీలో పెద్ద చర్చ జరిగింది. అయితే అప్పట్లో తుది నిర్ణయం తీసుకోకుండా దీనిపై అధ్యయనానికి ఒక కమిటీని వేశారు. ఇప్పటికే గంజాయి సాగుకు చట్టబద్ధత కల్పించిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలించిన అనంతరం ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రూపొందించిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని జగ్జిత్‌సింగ్ వివరించారు. ప్రతిపక్షాలు కూడా దీన్ని అంగీకరించాయని, ఔషధ, పారిశ్రామిక వినియోగానికి మినహా ఇతర రూపాల్లో దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా చట్టంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. గంజాయి సాగును చట్టబద్ధం చేయడంతో రాష్ట్రంలో ఆ పంట సాగు విస్తృతం కానుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనివల్ల రైతులకు మేలు జరగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు మంచి ఆదాయం సమకూరుతుంది. దేశవ్యాప్తంగా గంజాయి సాగుపై నిషేధం ఉన్నా.. ఔషధ, పారిశ్రామిక వినియోగం పేరుతో మధ్యప్రదేశ్, జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో గంజాయి సాగు ఇప్పటికే చట్టబద్ధంగా జరుగుతోంది. అలాగే ప్రపంచంలో అధికశాతం దేశాలు గంజాయిని నిషేధిత మత్తుపదార్థంగా పరిగణిస్తూ, దాని సాగును చట్టవ్యతిరేకంగా ప్రకటించి నిషేధం అమలు చేస్తున్నా కొన్ని దేశాలు మాత్రం సాగుకు పరిమితంగా అనుమతిస్తున్నాయి. కొన్ని నెలల క్రితమే జర్మనీలో గంజాయి సాగును చట్టబద్ధం చేశారు. ఒక్కో ఇంట్లో మూడు మొక్కలకు మించకుండా పెంచుకోవడానికి జర్మనీ ప్రభుత్వం అనుమతించింది. మరోవైపు దీని సాగుకు అనుమతించిన తొలి ఆసియా దేశంగా థాయ్‌లాండ్ నిలిచింది. ఆ దేశంలో 2022లోనే గంజాయి సాగు, విక్రయాలకు చట్టబద్ధత కల్పించారు. గంజాయి మత్తు కలిగించే ఉత్ప్రేరకమే అయినప్పటికి దానిలో విశేషమైన ఔషధ గుణాలున్నాయన్నది వాస్తవం. అయితే మొదటి నుంచీ ఇది మత్తుపదార్థంగానే ప్రచారంలో ఉంది. గంజాయి నుంచి మార్జువానా, హషీస్, హెరాయిన్ తదితర పలు రకాల మాదకద్రవ్యాలను తయారు చేస్తుంటారు. ఈ కారణంగానే అధిక శాతం దేశాలు, రాష్ట్రాలు గంజాయితో పాటు ఇతర డ్రగ్స్‌ను అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. దీనికోసం ఎన్నో కఠిన చట్టాలను అమలు చేస్తున్నాయి. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక విభాగాలు, బృందాలను నియోగిస్తున్నాయి. మరోవైపు గంజాయి సహా మత్తుపదార్థాల రవాణా, విక్రయాలకు ప్రపంచవ్యాప్తంగా మాఫియా ముఠాలు బలమైన నెట్‌వర్క్ ఏర్పరచుకుని పనిచేస్తున్నాయి. దీని ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండటమే డ్రగ్స్ మాఫియా వేళ్లూనుకోవడానికి దోహదం చేస్తోంది. మన దేశంలో ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్ సహా పలు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. గిరిజనులు, యువత కాసులకు ఆశపడి ఈ దందాల్లో భాగస్వాములవుతున్నారు. పోలీసులు ఎన్నిసార్లు పట్టుకుని జైళ్లలో పెట్టినా, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ అదే పని చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఒకదాని తర్వాత ఒకటిగా రాష్ట్రాలు ఔషధ, పారిశ్రామిక అవసరాల పేరుతో గంజాయి సాగుకు చట్టబద్ధత కల్పిస్తే అది దుర్వినియోగం కావడం తథ్యమన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పూర్తిగా నిషేధం ఉండి జైళ్లపాలవుతున్నా గంజాయి అక్రమ రవాణా తగ్గకపోగా నానాటికీ పెరుగుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. అలాంటిది ఏ పేరుతోనైనా పాక్షికంగా సాగుకు, అమ్మకాలకు అనుమతిస్తే.. అది పూర్తిగా దుర్వినియోగమయ్యే ప్రమాదముందంటున్నారు. ఔషధాలు, పారిశ్రామిక అవసరాల ముసుగులో గంజాయి అక్రమ వ్యాపారం విశృంఖలంగా పెరిగిపోతే.. సమాజంపై దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందన్నది ఆందోళన కలిగించే అంశం.

# ఒక కూతురి స్ఫూర్తి!

### నీ కుడి చేయి నేనే నాన్నా...

Courtesy: Sakshi



తెలుగులో 'నీ కుడిభుజం నేనవుతా..' అని ఒకానొక వాడుక మాట. అంటే నీకు అండగా నిలబడతానని అర్థం. అలా తండ్రికి కుడి భుజం పని చేయకపోతే నిజంగా కూతురు కుడి భుజమైన స్ఫూర్తిదాయకమైన కథనమిది. భువనగిరిలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే ఎల్లయ్యకు ఆరు నెలల క్రితం పక్షవాతం సోకి కుడి చేయి పడిపోయింది. దోమకాటుకు, చీమకుట్టుకు కూడా ఆత్మహత్య చేసుకునేవారు కొందరు. కాళ్లకింద భూమి రెండుగా చీలినా, మిన్ను విరిగి మీద పడినా చలించక.. రేపటి వెలుగులు వెతుక్కుంటూ తమను తాము ముందుకు నడుపుకునేవారు కొందరు. ఎల్లయ్య రెండో రకం.

'ఎన్నాళ్లని ఇంట్లో ఇలా దిగులుపడుతూ కూర్చోవడం? కుడి చేయే కదా పని చేయదు.. ఎడమ చేయి బాగానే ఉంది.. జీవితంలో అప్పుడే అలసిపోతే ఎలా?' అని తనకు తానే ధైర్యం చెప్పుకుని ఎడమ చేత్తోనే ఆటో నడపడం మొదలుపెట్టాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న కూతురు ఊర్మిళ తండ్రి తపనను, సంకల్పాన్ని అర్థం చేసుకుంది. ఎడమ చేత్తో ఎల్లయ్య ఆటో గేరు మారుస్తూ.. ఎడమ కాలితో బ్రేక్ తొక్కుతుంటే, ఊర్మిళ కుడి చేత్తో ఎక్సలేటర్ పట్టుకుని నడుపుతోంది. స్కూల్ అయిపోగానే రోజూ సాయంత్రం ఊర్మిళ తండ్రితో పాటు ఆటో నడుపుతోంది. అక్షరాలా తండ్రికి కుడి భుజమయ్యింది.

అనితరసాధ్యమైన ఐఐటీలు చదువుతూ మార్కులు సరిగా రాలేదని ఆత్మహత్యలు చేసుకునే రోజుల్లో ఊర్మిళ చొరవ, పరిపక్వత, శ్రమ మార్గం చాలా గొప్పవి. తండ్రికి తగ్గ తనయ.

జీవితం అంటే గెలుపు.. జీవితమంటే సుఖం.. జీవితమంటే శిఖరారోహణం.. అని మన నరనరాన ఎక్కించుకున్నాం. జీవితమంటే ఎడతెగని ప్రయాణం. గెలుపోటములు, ఎగుడు దిగుళ్లు, కష్టనష్టాలు సహజం. దూరం బాధిస్తున్నా పక్షి విశ్వాసం రెక్కలు విప్పుతూనే ఉంటుంది. అలలను సవాలు చేసి చేపపిల్ల ఈదుతూనే ఉంటుంది. గ్రీష్మంలో ఎండిన కొమ్మే చైత్రంలో చిగురించి.. ప్రకృతికి పట్టుచీరల సారె పెడుతుంది. మావి చిగురుకోసం కోయిల నిరీక్షిస్తూ ఉంటుంది. కోయిల పిలుపు కోసం మావి కొమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది. చీకటి రాత్రి కొమ్మ మీదే రేపటి వెలుగుల సూరీడు ఎదురుచూస్తూ ఉంటాడు. కష్టాల వెంట సుఖాలు, సుఖాల వెంట కష్టాలు, కష్టాల వెంట కష్టాలను తలచుకుని తలచుకుని బాధపడుతూ ఉంటే.. గుండె మరింత బరువెక్కి దిక్కుతోచదు.

జీవితమంటే బరిలో గిరిగీసి నిలవడం.. జీవితమంటే బతికి బతికించడం.. జీవితమంటే మనను మనమే నడిపించుకోవడం.. మన యుద్ధం ఇంకెవరో చేయరు.

'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి
ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి
విశ్రమించవద్దు ఏ క్షణం
విస్మరించవద్దు నిర్ణయం
అప్పుడే నీ జయం నిశ్చయంరా
నొప్పి లేని
నిమిషమేది జననమైన
మరణమైన జీవితాన అడుగు అడుగునా
నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు
బ్రతుకు అంటే నిత్య ఘర్షణ
దేహముంది ప్రాణముంది నెత్తురుంది
సత్తువుంది ఇంతకన్న సైన్యముందునా
ఆశ నీకు అస్త్రమౌను శ్వాస నీకు శస్త్రమౌను
దీక్షకన్న సారథెవరురా
నిరంతరం ప్రయత్నమున్నదా
నిరాశకే నిరాశ పుట్టదా
నిన్ను మించి శక్తి ఏది నీకె నువ్వు బాసటైతే
నింగి ఎంత గొప్పదైనా రివ్వుమన్న గువ్వపిల్ల
రెక్కముందు తక్కువేనురా
సంద్రమెంత పెద్దదైనా ఈదుతున్న చేపపిల్ల
మొప్పముందు చిన్నదేనురా
పిడుగువంటి పిడికిలెత్తి ఉరుమువల్లె
హుంకరిస్తే దిక్కులన్నీ పిక్కటిల్లురా
ఆశయాల అశ్వమెక్కి అదుపులేని
కదనుతొక్కి అవధులన్నీ అధిగమించరా
త్రివిక్రమా పరాక్రమించరా
విశాల విశ్వమాక్రమించరా
జలధిసైతమాపలేని జ్వాల ఓలె ప్రజ్వలించరా'

****

చిత్రం : పట్టుదల (1992)
రచన : సిరివెన్నెల
సంగీతం : ఇళయరాజా
గానం : కె.జె.ఏసుదాస్

ప్రాణం ఉన్నంతవరకూ పోరాడాలి. ప్రాణం పోయేంతవరకూ పోరాడాలి. ప్రాణం పోతున్నా పోరాడుతూనే ఉండాలి. పోరాడుతూనే పోవాలి. పోతే చరిత్రగా మిగిలిపోవాలి.

ఎల్లయ్య కుడిభుజమైన తనయ ఊర్మిళ నడుపుతున్నది ఆటో కాదు.. నడుపుతున్నది అక్షరాలా కొండంత జీవన పోరాటాన్ని, పెద్ద ఆదర్శాన్ని. మొక్కవోని ధైర్యాన్ని.. సముద్రమంత సహనాన్ని. శెభాష్ తల్లీ! నువ్వు నడిచి గెలవాల్సిన దారులు ఇంకా ఎన్నెన్నో ఎదురుచూస్తున్నాయి. నువ్వు చేరాల్సిన విజయాల తీరాలు నీకోసం ఎదురుచూస్తున్నాయి.

- పమిడికాల్వ మధుసూదన్




కథ:ప్రసాద్ (విశ్వదేవ్ రాచకొండ).. సరస్వతి (నివేథా థామస్) తిరుపతిలో నివాసముండే ఒక మధ్య తరగతి జంట. వీరికి ఇద్దరు అబ్బాయిలు. వారిలో పెద్దబ్బాయి అయిన అరుణ్ (మాస్టర్ అరుణ్ దేవ్)కు లెక్కలంటే గిట్టదు. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సంపాదించినా.. గణితంలో మాత్రం ఎప్పుడూ సున్నానే వస్తుంటుంది. లెక్కల్లో అతనడిగే కొన్ని డౌట్లకు టీచర్లు సహా ఎవ్వరూ సమాధానం చెప్పరు. దీంతో గణితం పట్ల వ్యతిరేక భావం ఏర్పడి ఆ సబ్జెక్ట్ చదవకపోవడంతో ప్రతిసారీ జీరోనే వస్తుంటుంది. ఐతే తన స్కూల్లోకి చాణక్య (ప్రియదర్శి) అనే కొత్త లెక్కల మాస్టర్ రావడంతో అరుణ్ కు ఇబ్బందులు ఎదురవుతాయి. ఆ ఇబ్బందులు కుటుంబం వరకు వెళ్లి అరుణ్ ఇల్లు వదిలి వెళ్లిపోయే పరిస్థితి తలెత్తుతుంది. ఈ స్థితిలో అరుణ్ మళ్లీ ఇల్లు ఎలా చేరాడు.. గణితం మీద తన ఆలోచనను మార్చి ఆ సబ్జెక్టుపై అతను పట్టు సాధించేలా చేయడానికి సరస్వతి ఏం చేసింది.. చివరికి ఆమె లక్ష్యం నెరవేరిందా లేదా అన్నది మిగతా కథ.

ఈ మధ్య కొన్ని సినిమాలు స్టార్ పవర్ లేకపోయినా కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పించాయి. కమిటీ కుర్రోళ్ళు.. ఆయ్ లాంటి చిత్రాలు అందుకు ఉదాహరణ. '35: చిన్న కథ కాదు' కూడా ఈ కోవలోకి చేరే సినిమా కనిపించింది ప్రోమోలు చూస్తే. రానా దగ్గుబాటి సమర్పణలో కొత్త దర్శకుడు నందకిశోర్ యేమాని రూపొందించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ప్రోమోలున్నంత ఆహ్లాదకరంగా సినిమా కూడా ఉందా? తెలుసుకుందాం పదండి.

నటీనటులు:
మంచి కథ.. పాత్రలు రాసుకుంటే.. అందుకు తగ్గ నటీనటులను ఎంచుకుంటే ఇక పెర్ఫామెన్సుల విషయంలో ఢోకా ఏముంటుంది? చాన్నాళ్ల తర్వాత తెలుగు తెరపై మెరిసిన నివేథా థామస్ తన కెరీర్లో గుర్తుండిపోయే పాత్రను చేసింది. సరస్వతిగా తన అభినయం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆమెను తెలుగు సినిమా సరిగా వాడుకోలేకపోతోందే అనిపించేలా ఆమె ఆ పాత్రను పండించింది. మధ్య తరగతి ఇల్లాలి పాత్రలో సులువుగా ఒదిగిపోవడమే కాదు.. చిత్తూరు యాసలో సొంతంగా చక్కగా డైలాగులు చెప్పి మెప్పించింది నివేథా. కొన్ని చోట్ల తన నటన కన్నీళ్లు తెప్పిస్తుంది. ఆమె భర్త పాత్రలో విశ్వదేవ్ కూడా బాగానే ఒదిగిపోయాడు. తన పాత్ర పరిధి తక్కువే అయినా.. ఉన్నంతలో చక్కగా నటించాడు. ఇక కథకు మూలమైన అరుణ్ అనే చిన్న పిల్లాడి పాత్రలో నటించిన అరుణ్ దేవ్ కూడా భలే చేశాడు. 'తారే జమీన్ పర్'లో పిల్లాడిని గుర్తుకు తెచ్చేలా ఇన్నోసెంట్ లుక్స్ తో అరుణ్ ఆకట్టుకున్నాడు. అమాయకత్వం ఉట్టిపడేలా సాగిన తన హావభావాలు ముచ్చటగొలుపుతాయి. ప్రియదర్శి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో రాణించాడు. తన నటన సహజంగా సాగింది. ఇగోయిస్టిక్ టీచర్ పాత్రలో కొలిచినట్లు నటించాడు ప్రియదర్శి. భాగ్యరాజ్ ప్రిన్సిపల్ పాత్రకు సరిపోయాడు. రేవతి పాత్ర చిన్నదే అయినా ఎఫెక్టివ్‌గా అనిపిస్తుంది. ఆమె నటన కూడా బాగుంది. సహాయ పాత్రలో కృష్ణతేజ కూడా ఓకే. కిరణ్మయి పాత్రలో చేసిన చిన్న పాప.. లీడ్ రోల్ చేసిన అబ్బాయి తమ్ముడు.. తన క్లాస్మేట్స్ గా చేసిన పిల్లలతోనూ దర్శకుడు బాగా చేయించాడు.

# చిన్నకథలో పెద్ద అర్థం!

కథనం- విశ్లేషణ:

మంచి కథలు చెబుతాం.. సందేశాలిస్తాం అంటే చూసే రోజులు కావివి. ఎంత చెడు చూపిస్తే సినిమాలు అంత బాగా ఆడుతున్న రోజుల్లో పనిగట్టుకుని ప్రధానపాత్రలకు నెగెటివ్ షేడ్స్ అద్దుతుండడం గమనించవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కొందరు దర్శకులు పట్టుబట్టి 'మంచి' కథలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఐతే ఆ మంచి క్లాస్ పీకినట్లు చూపిస్తే ప్రేక్షకులకు ఎక్కదు. కథనంలో వినోదానికి ఢోకా లేకుండా చూసుకోవడం..ప్రధాన పాత్రలను ప్రేక్షకులు రిలేట్ చేసుకునేలా తీర్చిదిద్దడం.. అర్థవంతమైన-ఆలోచన రేకెత్తించే సంభాషణలు జోడించడం.. వీటన్నింటికీ తోడు ఆర్టిస్టులు-సాంకేతిక నిపుణులు మనసు పెట్టి పని చేయడం.. ఇవన్నీ తోడైతే ప్రేక్షకుల్లో కదలిక వస్తుంది. వాళ్లకా మంచి చేరుతుంది. '35: చిన్న కథ కాదు'లో ఈ లక్షణాలన్నీ ఉన్నాయి. కథపరంగా చూస్తే చాలా చిన్న పాయింట్ అయినా.. దాని ద్వారా చెప్పాలనుకున్న విషయం చాలా పెద్దది. అందుకే రెండున్నర గంటలపాటు చూసి ఆస్వాదించడమే కాదు.. ఆ తర్వాత ఆలోచించేలా కూడా చేస్తుందీ సినిమా. పిల్లలవి సున్నితమైన మనస్తత్వాలు. చిన్నతనంలో వాళ్లలో ఏర్పడే అభిప్రాయాలు పిల్లల మనసుల్లో ఎంతో బలంగా నాటుకుపోతాయి. ఏదైనా విషయంలో ప్రతికూల అభిప్రాయం ఏర్పడితే.. దాన్ని మార్చడం అంత తేలిక కాదు. ఐతే వాళ్లకు చెప్పాల్సిన భాషలో చెబితే ఆలోచన మార్చుకుని అసాధ్యం అనుకున్నది కూడా సుసాధ్యం చేస్తారనే మంచి సందేశం ఇచ్చే ప్రయత్నం చేశాడు '35: చిన్న కథ కాదు' ద్వారా నందకిశోర్ యేమాని. ఐతే మంచి పాత్రలు.. చక్కటి సన్నివేశాలు.. అర్థవంతమైన డైలాగులు ఈ మంచి కథకు తోడవడంతో ఎక్కడా క్లాస్ పీకుతున్న భావన కలగదు. ఒక రకంగా చెప్పాలంటే ఈ సినిమాను తెలుగు 'తారే జమీన్ పర్' అని చెప్పొచ్చు. బహుశా దర్శకుడికి కూడా ఈ కథ రాయడానికి ఈ సినిమా స్ఫూర్తి అయి ఉంటే ఆశ్చర్యమేమీ లేదు. అందులో అసలు చదువే ఎక్కని కుర్రాడిలో తన టీచర్ ప్రేరణ కలిగిస్తే.. ఇక్కడ గణితం పట్ల మాత్రమే వ్యతిరేకత పెంచుకున్న కుర్రాడి సమస్యను తన తల్లే పరిష్కరిస్తుంది. ఐతే మనదైన పాత్రలు.. సన్నివేశాలు.. మాటలతో.. ఉట్టిపడే నేటివిటీతో ఇది అచ్చ తెలుగు సినిమా అనే భావన మాత్రం అడుగడుగునా కనిపిస్తుంది. ప్లాట్ పాయింట్ చాలా చిన్నదిగా కనిపించినా.. దాన్ని రెండున్నర గంటలకు విస్తరించిన స్క్రీన్ ప్లేలో దర్శకుడి ప్రత్యేకత కనిపిస్తుంది. పిల్లాడి సమస్యను వినోదాత్మకంగా చెప్పడం ద్వారా ఆరంభ సన్నివేశాలను సరదాగా నడిపించాడు. పిల్లాడితో పాటు తల్లిదండ్రులు.. టీచర్ పాత్రలు కూడా ఆసక్తికరంగా అనిపించడం.. ఆర్టిస్టులు కూడా చక్కగా పెర్ఫామ్ చేయడం.. సన్నివేశాలు-మాటలు సింపుల్ గా అనిపిస్తూనే ఆహ్లాదాన్ని పంచడంతో ప్రేక్షకులకు బోర్ కొట్టదు. తొలి అరగంట వినోదం తర్వాత పిల్లాడి సమస్య తీవ్రమై భావోద్వేగాల వైపు కథ తిరుగుతుంది. ఆ సీన్లను కూడా దర్శకుడు బాగా డీల్ చేశాడు. దిక్కుతోచని స్థితిలో పిల్లాడు ఇంటి నుంచి వెళ్లిపోయాక.. అతణ్ని వెతికి పట్టుకునే క్రమం మీద కథ నడుస్తుందని అనుకుంటాం. కానీ ఆ వ్యవహారాన్ని సింపుల్ గా తేల్చేసి.. వేరే టాస్క్ వైపు కథనాన్ని నడిపించాడు దర్శకుడు. ఇంటర్వెల్ వరకు కొంచెం రేసీగా అనిపించే సినిమా.. ఆ తర్వాత ఓ అరగంట కొంచెం గందరగోళంగా అనిపిస్తుంది. కానీ పిల్లాడు గణితంలో 35 మార్కులు సంపాదించడం అన్నది పెద్ద టాస్క్ గా మారి.. దాంతోనే అన్ని సమస్యలకూ పరిష్కారం లభించే పరిస్థితి రావడంతో కథ రసకందాయంలో పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో చాలావరకు సినిమాటిక్ స్టయిల్లో కథను నడిపిస్తుంటారు. ఇందులో కూడా కథ పరంగా ఆ శైలినే అనుసరించినా.. సన్నివేశాలు చాలా వరకు రియలిస్టిగ్గానే సాగుతాయి. నాటకీయత మరీ ఎక్కువ లేకుండా బాగానే డీల్ చేశాడు. పతాక సన్నివేశాలు ప్రేక్షకులకు మంచి ఫీల్ ఇస్తాయి. సినిమా కొంచెం లెంగ్తీగా అనిపించడం.. నరేషన్ స్లో ఉండడం.. ద్వితీయార్ధంలో ఓ అరగంట సన్నివేశాలు కొంచెం గజిబిజిగా సాగడం తప్పితే '35: చిన్న కథ కాదు'లో పెద్ద కంప్లైంట్స్ ఏమీ కనిపించవు. వినోదానికి ఢోకా లేకుండానే పేరెంటింగ్.. టీచింగ్ విషయంలో పాఠాలు ఆలోచన రేకెత్తించే మంచి విషయాలు ఇందులో ఉన్నాయి. అర్థవంతమైన ఓ మంచి సినిమాను చూసిన ఫీలింగ్ తో బయటికి వస్తాం. ఇలాంటి సినిమాలకు చేయూతనందిస్తే.. తెరపై మరిన్ని మంచి కథలు చూడ్డానికి అవకాశముంటుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

సాంకేతిక వర్గం:
వివేక్ సాగర్ తన పాటలు.. నేపథ్య సంగీతంతో సినిమాలోని ఆహ్లాదాన్ని ఇంకా పెంచాడు. పాటలు చార్ట్ బస్టర్స్ కావు కానీ.. సందర్భానుసారంగా సాగిపోతూ ప్లెజెంట్ ఫీల్ ఇస్తాయి. నేపథ్య సంగీతం కూడా అలాగే సాగింది. నికేత్ బొమ్మిరెడ్డి ఛాయాగ్రహణం నీట్‌గా సాగింది. నిర్మాణ విలువల్లో కొన్ని పరిమితులు కనిపించినా.. కంటెంట్ ప్రధానంగా సాగిన సినిమా కావడంతో అది పెద్ద ఇబ్బందిలా అనిపించదు. ఇలాంటి కథకు మద్దతునిచ్చిన నిర్మాతలు అభినందనీయులు. ఇక నందకిశోర్ యేమాని తొలి చిత్రంతోనే రచయితగా..దర్శకుడిగా అభిరుచిని చాటుకున్నాడు. శైలి పరంగా 'నైంటీస్ మిడిల్ క్లాస్'తో పరిచయమైన ఆదిత్య హాసన్ సరసన నిలిచే దర్శకుడు నందకిశోర్. అతను ఎంచుకున్న కథ చిన్నదైనా.. దాన్ని ఆద్యంతం మంచి ఫీల్‌తో.. చక్కటి స్క్రీన్‌ప్లే.. డైలాగులతో ఆసక్తి సన్నగిల్లకుండా చూశాడు. తన నరేషన్ కొంత స్లో.. ద్వితీయార్థంలో కాసేపు కథ పక్కదోవ పట్టినట్లు అనిపించడం మినహాయిస్తే నందకిశోర్ పనితనానికి వంకలు పెట్టడానికేమీ లేదు.



హత్య జరిగి ఏడేళ్లయినా కేసులో పురోగతి శూన్యం

రాష్ట్ర ప్రభుత్వం అదిలించినా కదలని కేసు విచారణ

హిందుత్వ నేరాలకు ఈ దేశంలో శిక్షలు పడవేమో!



# గౌరి హంతకులకు బెయిల్!

- దుప్పల రవికుమార్

నిప్పుకణిక లాంటి ఉద్యమకారిణి, విలేకరి గౌరి లంకేష్‌ను హత్య చేసారని ఆరోపించబడిన పద్దెనిమిది మంది నిందితుల్లో ఎనిమిది మందికి బెయిల్ లభించింది. కర్ణాటక హైకోర్టు సెప్టెంబరు 4వ తేదీన నలుగురికి బెయిల్ ఇచ్చింది. ఆ మరునాడు గౌరి లంకేష్ ఏడో వర్ధంతి. అంతకు ఎనిమిది నెలల ముందునుంచీ ఈ కేసులో నిందితులైన మరో నలుగురికీ ఒక్కొక్కరిగా బెయిల్ దొరుకుతూనే ఉంది. నిందితులకు బెయిల్ లభించినట్లయితే సాక్ష్యాలు తారుమారు చేసే అవకావముందని ప్రాసిక్యూషన్ వాదించినా ఫలితం లేకపోయింది. ఇంజనీరుగా పనిచేస్తున్న అమోల్ కాలే సనాతన సంస్థ అందించిన సాహిత్యం చదివి ప్రేరేపితుడై గౌరి హత్యకు కుట్ర పన్నాడు. దీనికి పదిహేడుమందిని పురమాయించాడు. కాలేజీ చదువులో సగం మానేసిన పరశురాం వాగ్మోర్ గౌరి ఇంటి గేటు దగ్గర తుపాకీతో కాల్చి చంపాడు. అతడిని గణేశ్ మిస్కిన్ ఒక మోటార్‌సైకిల్‌పై తీసుకువచ్చాడు. అమోల్ కాలే మిగిలిన 15 మందికి ఈ హత్య ఉదంతంలో వివిధ పాత్రలిచ్చాడు. కాపలా కాయడం, గౌరి ఇంటికి చేరుకోవడం, ప్రయాణ వసతులు ఏర్పాటుచేయడం, హత్య అనంతరం హంతకులను దాచడం, సాక్ష్యాలను ధ్వంసం చేయడం వంటివి చేసారు.

**పోలీసుల ఛార్జిషీటే అన్నీ చెప్తోంది!**

పోలీసులు వేసిన ఛార్జిషీటు ప్రకారం 2010 లగాయతు ఈ సనాతన సంస్థ వ్యక్తులు రకరాకల నేరాలకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. ఇప్పటి నిందితులు 18 మంది ఈ సనాతన సంస్థ లేదా హిందూ జనజాగృతి సమితికి చెందినవారే. వారికి ఆరాధ్యనీయమైన పుస్తకం క్షాత్రధర్మ సాధన. ఇది హిందూ వ్యతిరేకులను దుర్జనులుగా సంబోధిస్తుంది. కేవలం భయోత్పాతం సృష్టించడం ద్వారా హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతో వారు ఈ దురాగతానికి పాల్పడ్డారని ఛార్జిషీటులో పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలలో వివిధ గ్రామాలు, పట్టణాలలో 19 క్యాంపులు ఏర్పాటుచేసి, సుమారు ఎనిమిదేళ్ల పాటు ఆయుధాలను వాడే శిక్షణ ఇచ్చారని ఛార్జిషీటులో పేర్కొనడం విచారకరం. తుపాకులు పేల్చడం, బాంబులులాంటి మందుగుండు సామగ్రి తయారుచేయడం, కత్తులు వాడడం వంటి వాటిలో శిక్షణ మన యువతకు వీధుల్లోనే దొరుకుతోంది. మన మేమో విదేశాలను ముఖ్యంగా ముస్లిందేశాలను ఆడిపోసుకుంటుంటాం! 2010 నుంచీ ఈ సంస్థలో వీరంతా పని చేస్తున్నప్పటికీ 2016లో వారు గౌరీ హత్యకు నిర్ణయం తీసుకున్నారు. గౌరీ ఇచ్చిన ఒక ఉపన్యాసాన్ని వారు మనసుకు గట్టిగా పట్టించుకుని, ఇలాంటి దుర్జనురాలిని హతమార్చాలని తీర్మానించుకున్నారు. ఒక ఏడాది పాటు దీనికి సంబంధించిన రెక్కీ వేసారు. అమోల్ సూచన మేరకు వాసుదేవ సూర్యవంశి, సుజిత్ కుమార్ లిద్దరూ 2016 అక్టోబరులో దావనగేరేలో బాపూజీ ఆసుపత్రి వద్ద ఒక మోటారు సైకిల్ దొంగిలించారు. 2017 ఫిబ్రవరిలో వికాస్ పాటిల్, హెచ్‌ఎల్ సురేష్ గౌరి ఎక్కడ ఉండేదీ, ఎక్కడ పనిచేసేదీ చిరునామాలు తెలుసుకున్నారు.

రెండు నెలలపాటు అమిత్ బద్దీ, గణేష్ మిస్కిన్‌లు గౌరి ఉండే వీధిలోనే మకాం వేసి ఆమెను గమనించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాక గౌరిని మట్టు పెట్టడానికి రెండు ప్రదేశాలు ఎంపిక చేసారు. ఒకటి హెమ్మిగపుర జంక్షన్, రెండవది చిన్మయి పాఠశాల. ఒక ట్రెండు సార్లు రూట్ రిహార్సల్ కూడా చేసారు. సెప్టెంబరు 4వ తేదీన చంపాలనుకుని స్కూలుకు చేరారు. అప్పటికే ఆమె ఇంటికి వెళ్లిపోయింది. మర్నాడు కూడా ప్రయత్నించారు. గంటవరకూ రాకపోయేసరికి ఇంటికి చేరుకున్నారు. రాత్రి ఎనిమిది గంటలకు గౌరీ ఇంటికి చేరింది. కారు దిగి ఇంట్లోకి వస్తున్నపుడే ఆమెపై కాల్పులు జరిపారు. మూడు బుల్లెట్లు దిగేసరికి ఆమె కుప్పకూలిపోయింది. తుపాకులు, తూటాలు, వారి దుస్తులు ఎక్కడివక్కడ భద్రపరిచాక ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు. సురేష్ మొత్తం సాక్ష్యాలన్నీ నాశనం చేసి, మిగిలిన వాటిని మగది–తావరకెరె రహదారిపైనా, తిప్పెగొండనహల్లి రిజర్వాయర్ ప్రదేశంలో పడేశాడు. సేకరించిన తుపాకులు, మోటార్ సైకిల్ చేతులు మారేట్టు చేసారు. నవీన్ కుమార్ అరెస్టు వార్త తెలియగానే మళ్లీ అందరూ కలుసుకున్నారు. తమ ఫోన్లను ధ్వంసం చేసారు. తుపాకులను విడదీసి ముంబయి నాసిక్ హైవే పక్కన ఉల్లాస్ నదిలో గిరాటేసారు.

**హంతకులకు బెయిల్ మంజూరు**

మోహన్ నాయక్‌కు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయమని కోరుతూ కవితా లంకేష్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా సుప్రీంకోర్టు గుమ్మమెక్కాయి. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులో తాను జోక్యం చేసుకోనని చెప్పింది. అంతేకాకుండా విచారణ సమయంలో అతనెప్పుడూ వాయిదాలు కోరలేదని, అతని ప్రవర్తన బాగుందని సుప్రీంకోర్టు కితాబిచ్చింది. బెయిల్ షరతులు మీరితే తప్పక దానిని రద్దు చేస్తామని ఓదార్పునిచ్చింది. గౌరీ సోదరి కవిత మాట్లాడుతూ అలాంటి మనస్తత్వం ఉన్న మనిషి సమాజంలో ఉంటే ఎంతో ప్రమాదమని ఆవేదన చెందింది. కోర్టులు వారు నిర్దోషులని తేల్చితే తప్పదు గాని, అంతవరకూ వారిని జైలులోనే ఉంచాలని డిమాండ్ చేసింది. నిందితులకు త్వరితంగా శిక్షలు పడేందుకు వీలుగా ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తే మంచిదని ఆమె కోరారు. వీరి కోరికను మన్నిస్తూ గౌరీ లంకేష్ హత్య కేసుతో పాటు ఎంఎం కాల్బుర్గి కేసును కూడా ఛేదించడానికి ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తున్నట్టు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశాలిచ్చారు. కర్ణాటక హైకోర్టులో మాత్రం కదలిక లేదు. హైకోర్టు రిజిస్ట్రార్ ఇంతవరకూ ప్రభుత్వానికి బదులివ్వలేదు. ఎన్ని విన్నపాలు చేసినా కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ నిమ్మకు నీరెత్తినట్టే ఉన్నారు. హత్య జరిగి ఇప్పటికే ఏడేళ్లు అయింది. కేసు విచారణ త్వరలో ముగిసి, నిందితులకు శిక్ష పడుతుందనే ఆశ రోజురోజుకు సన్నగిల్లుతోంది.




## ప్రకృతి వ్యవసాయ రైతులకు అండగా శ్రీసత్యదేశి నర్శరీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



మారుతున్న కాలమాన పరిస్థితుల్లో సేంద్రియ వ్యవసాయం ఆవశ్యకత నానాటికి పెరుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు అన్నారు. ఆదివారం శ్రీశ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో చిలకపాలెం జంక్షన్ మునిపేట వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సత్యదేశి కూరగాయల మొక్కలు నర్సరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో జీవుల వివిధ దశలను, నెలలో గల సూక్ష్మజీవుల పనితనాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయం చేయుటకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ, హానికర రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సత్య నర్సరీ ప్రారంభించడానికి కారణం శ్రీశ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి ఆధ్వర్యంలో రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు ఇవ్వడం అభినందనీయమ న్నారు. నర్సరీ యజమాని రుద్రరాజు రామసత్యనారాయణరాజు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతతో మొక్కల పెంపకం కోసం శ్రీశ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మంచి దేశీ విత్తనాలతో నర్సరీ తయారుచేసి ఆరోగ్యకరమైన నారు అందిస్తామన్నారు. అధిక దిగుబడి, అత్యధిక పోషకవిలువలు కలిగిన నారు మొక్కలు రైతులకు, గృహిణులకు, ఔత్సాహిక యువ రైతులకు అందించాలన్న సంకల్పంతో సత్య నర్సరీ ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో చిలకపాలెం గ్రామ సర్పంచ్ రమణ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ డీడీసీ సభ్యులు బీవీ రవిశంకర్, టీచర్లు దేసూళ సురేంద్ర ఎస్.వి.ఎ,పోలినాయుడు, దార్లపూడి రవి,రైతుసన్యాసి నాయుడు, రమణబాబులు పాల్గొన్నారు.

## కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఔదార్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయవాడ వరద ముంపులో సర్వం కోల్పోయినవారి కోసం తమవంతుగా నిత్యావసర సరుకులు, బిస్కట్ పేకెట్స్, వాటర్ బాటిల్స్‌లను అందజేశారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ఇలాంటి విపత్తు సమయంలో నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలన్నారు. తమ కళాశాలల విద్యార్థులు ఇలాంటి సహాయ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు పాల్గొన్నారు.




## గంజాయి ముఠా అరెస్టు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ముఠాతో సంబంధం ఉన్న 12 మందిని గుర్తించామని, వారిలో 9 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన వల్లంశెట్టి చందు, కోలా అరుణ్ కుమార్, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదరావు, చీకటి యోగేశ్వరరావు, జామి మోహన్‌కృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ, ఒడిశా రాష్ట్రం కొరాపుట్ పొట్టంగి సమితికి చెందిన హరీష్ గుంత, బంక జోసెఫ్‌ను అరెస్టు చేశారు. ఈ నెల 7న శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి పొన్నాడ వంతెన పక్కన సాయిగిరి గుడి రోడ్డు వద్ద గంజాయితో రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద 5 కిలోల సరకు, రెండు ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వారిచ్చిన సమాచారం మేరకు వాంబే కాలనీ దగ్గర డచ్ బంగ్లా వద్ద మరో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద 17 కిలోల గంజాయి, చరవాణి స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ చెప్పారు.

**కిలో రూ.5 వేలకు విక్రయం..**



ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కుందిలి గ్రామానికి చెందిన వ్యాపారి హరీష్ గుంత, బంక జోసెఫ్ అదే రాష్ట్రం బూరుగులపాడు గ్రామానికి చెందిన సీనా వద్ద కిలో గంజాయి రూ.మూడు వేలకు కొనుగోలు చేస్తున్నారని, శ్రీకాకుళం నగరానికి చెందిన వల్లంశెట్టి చందు, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదారావు, అందాల సాయి నిఖిల్, చీకటి యోగేశ్వరరావు, జామి మోహనకృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ, జలగడుగుల వికాస్, మరికొందరికి రూ.5 వేలకు విక్రయిస్తున్నారని, చందు, మరికొంతమంది వినియోగదారులకు 930 గ్రాములు రూ.400కు అమ్ముతున్నారని ఎస్పీ వివరించారు. ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, గ్రామీణ సీఐ, ఎస్‌బీ, పోలీసు సిబ్బంది ముద్దా జగదీష్, సూరిబాబు, రవికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## కుందువానిపేటకు లయన్స్ సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కుందువానిపేట గ్రామస్థులకు అండగా లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అండగా ఉంటుందని క్లబ్ అధ్యక్షులు లయన్స్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ సోమవారం తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనల మేరకు కుందువానిపేట గ్రామాన్ని, అక్కడివారు పడుతున్న కష్టాలను పరిశీలించి పాలు, పళ్లు, బిస్కెట్స్, వాటర్ బాటల్స్ అందించామని తెలిపారు. వరద బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలను లయన్స్ వైద్య బృందం, సెక్రటరీ లయన్ డాక్టర్ పైడి సింధూర, ఇతర వైద్య బృందంతో నిర్వహించి మందులను కూడా అందించటానికి సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మెంటార్ నటుకుల మోహన్, పొన్నాడ రవి, బాడాన దేవభూషణం, టెక్కం రామ్‌గోపాల్, గుత్తు చిన్నారావు, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్‌లు పాల్గొన్నారు.

## క్షతగాత్రునికి రూ.20 వేలు సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

సింగుపురం గ్రామానికి చెందిన కోట నాగరాజు ఇటీవల రోణంకి గ్రామ కూడలి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడ్డారు. ఈయన్ను శ్రీకాకుళం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం జెమ్స్ వైద్యశాలలో చేర్పించారు. పరిశీలించిన వైద్యులు తలకు బలమైన గాయమైందని, 48 గంటలు వేచిచూడాలన్నారు. తండ్రి రిక్షాకార్మికుడు కాగా, నాగరాజు అద్దెకు ఆటో నడుపుతుంటారు. పేద కుటుంబం కావటంతో, అందులోనూ కుటుంబానికి అండగా ఉన్న నాగరాజుకు ప్రమాదం జరగటంతో, గ్రామస్థుల సహాయం కోసం సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితిని సంప్రదించారు. స్పందించిన సభ్యులు, మిత్రులు, దాతలు సహకారంతో సమకూర్చిన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని జెమ్స్ వైద్యశాలకు వెళ్లి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో పి.అవినాష్, బి.చంద్రశేఖర్, పి.చరణ్, పి.వరప్రసాద్, డాక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.



## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాధిత హోంగార్డు కుటుంబానికి సహచర హోంగార్డులు బాసటగా నిలిచి వారి యొక్క ఒక్క రోజు వేతనాన్ని ఇచ్చారు. తోటి ఉద్యోగుల ఆర్థిక సహాయంగా స్వతహాగా ఇచ్చిన రూ.4లక్షల 13వేల నగదు చెక్కును ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డు టి.కాంతారావు కుటుంబసభ్యులకు ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డు కాంతారావు మరణించడం చాలా బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని, ఎటువంటి అవసరం ఉన్న, పోలీసు శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటూ, ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించవచ్చనని ఎస్పీ భరోసా కల్పించారు. విధులు నిర్వర్తిస్తూ మరణించిన లేదా రిటైర్మెంట్ పొందిన హోంగార్డుల కుటుంబసభ్యులకు జిల్లాలో పనిచేస్తున్న తోటి హోంగార్డులు అందరు కలిసి ఇటువంటి సమయంలో ఆర్థిక చేయూతగా అండగా ఉండటం ఐక్య మత్యానికి సూచిక ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ, హోంగార్డు కుటుంబ సభ్యులు ఉన్నారు.






















# ప్రశ్నిస్తే పీకేస్తారా?!

(మొదటిపేజీ తరువాయి)

అకామిడేట్ చేయలేదు. అలాగే నిన్నటి వరకు డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పేడాడ పరమేశ్వరరావుకు కూడా మరో పదవి ఇవ్వలేదు. ఇక కిల్లి కృపారాణికి రీజనల్ కోఆర్డినేటర్ పదవి ఇస్తారని అంతా భావించారు. కనీసం ఆ ప్రస్తావన కూడా షర్మిల జాబితాలో లేకుండా పోయింది. ఆ మాటకొస్తే ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పదవులు పోయినవారెవరికీ షర్మిల కొత్త జాబితాలో చోటు లభించలేదు.

### ఫిర్యాదు చేసినందుకేనా?

దీనంతటికీ కారణం.. ఇప్పుడున్న కాంగ్రెస్ నాయకుల్లో అధిక శాతం మంది తనపై ఫిర్యాదు చేశారనే అక్కసుతోనే షర్మిల మొత్తాన్ని ఊడ్చేశారు. తప్పులేదు.. ఆమె పీసీసీ అధ్యక్షురాలు కాబట్టి తన టీమ్ ఎలా ఉండాలన్న దానిపై ఆమెకో ఆలోచన ఉంటుంది. కానీ ఆ సాకుతో పార్టీకి ఏ మాత్రం పనికిరానివారిని రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల పదవుల్లో కూర్చోబెట్టారు. గత ఎన్నికల్లో పార్టీ నుంచి ఫండ్ వచ్చినా ఎక్కడా కాంగ్రెస్ అభ్యర్థులకు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఒక్కరికి కూడా ఒక్క రూపాయి అయినా ఇవ్వలేదని అధిష్టానానికి ఫిర్యాదు వెళ్లింది. దీంతో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఉన్న పి.రాకేష్ రెడ్డి, సుంకరి పద్మశ్రీ, జంగా గౌతమ్, షేక్ మస్తాన్ వలీలను ముందుగా షర్మిల పదవుల నుంచి లేపేశారు. వీరితో పాటు అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి వెళ్లారని శ్రీకాకుళం డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావుపై వేటు వేశారు. అలాగే ఆయన సామాజికవర్గానికి చెందినవారని, ఆయనతో ఫాలో అవుతున్నారన్న ఒకే ఒక్క కోణంతో సనపల అన్నాజీ లాంటి వారిని కూడా పదవుల నుంచి తప్పించేశారు. మరీ విచిత్రమేమిటంటే.. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మాజీ కౌన్సిలర్ గోవింద మల్లిబాబు వివాదరహితుడు. గ్రూపులతో సంబంధం లేని ఈయనకు కూడా ఎటువంటి పదవి ఇవ్వలేదు. ఉత్తరాంధ్ర మొత్తం మీద ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నడిచిన పి.రాకేష్‌రెడ్డి, సుంకరి పద్మశ్రీలనూ షర్మిల విడిచిపెట్టలేదు. జంగా గౌతమ్ లాంటి సీనియర్ నాయకులను పక్కన పెట్టేశారు. ఎన్నికల కోసం వచ్చిన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించినందుకు, ఫిర్యాదు చేసినందుకే మొత్తం సీన్‌ను షర్మిల తలకిందులు చేసేశారు. వైకాపాలో వేగలేక, టీడీపీ గూటికి చేరలేక, బలపడితే కాంగ్రెస్ వెనుక వెళ్లిపోవాలని భావిస్తున్న అనేక మంది సీనియర్ నాయకులు షర్మిల చర్యలు అర్థంకాక తల పట్టుకుంటున్నారు.

# గణేషుడి ఆశీర్వాద బలం.. రూ.25వేల కోట్ల ఊతం



- దేశవ్యాప్తంగా ఘనంగా వినాయక ఉత్సవాలు
- వివిధ రంగాలకు భారీగా పెరిగిన టర్నోవర్
- వ్యాపార, అలంకరణ, విగ్రహాల తయారీ రంగాలకు జోష్
- లక్షలాది మందికి చేతినిండా పనులు
- కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్ అంచనా

ఒడియాలో 'బారో మాసొకు తీరొ జత్రా' అనే సామెత ఉంది. సంవత్సరంలో ఉండే 12 నెలల్లో 13 జాతరలు జరుగుతాయని దాని అర్థం. దేశంలో పండుగలు, జాతరలకు కొదవ లేదనడానికి ఈ సామెత దర్పణం పడుతుంది. అయితే అన్ని పండుగలు, జాతరలకు ఒకేరకమైన ప్రాముఖ్యత, విశిష్టత ఉండదు. వాటిలో కొన్నే ఘనంగా జరుగుతాయి. కొన్నే కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఒకేసారి ఘనంగా జరుగుతాయి. వాటిలో చెప్పుకోతగ్గవి గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే దేవీ నవరాత్రుల కంటే వినాయక చవితి పేరుతో నిర్వహించే గణపతి నవరాత్రులకే ఎక్కువ సందడి ఉంటుంది. ఖర్చు కూడా అలాగే ఉంటుంది. వినాయక చవితి వస్తుందంటే చాలు పది పదిహేను రోజుల ముందు నుంచే చందాల వసూళ్లు మొదలవుతాయి. ఇది కొందరికి ఇబ్బందికరంగానూ ఉంటుంది. దీనికి మరో పార్శ్వం చూస్తే.. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణేష్ నవరాత్రుల వల్ల వ్యాపార, సేవా, క్యాటరింగ్ తదితర అనేక రంగాలకు ఆర్థిక ఊతం లభిస్తుంది. తద్వారా దేశ ఆర్థికరంగం కూడా పరిపుష్టం అవుతుంది. ఈ ఏడాది వినాయక నవరాత్రుల పేరుతో దేశవ్యాప్తంగా రూ.25వేల కోట్ల ఆదాయం దేశ ఆర్థిక రంగానికి లభిస్తుందని అంచనా వేయడం విశేషం.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

వినాయక చవితి.. మామూలుగా హిందువులు జరుపుకొనే అనేకానేక పండుగల్లో ఒదొకటి. కానీ మిగతా పండుగలకు దీనికి మధ్య చాలా తేడా ఉంది. సాధారణంగా అన్ని పండుగలను ప్రజలు ఇళ్లలోనే జరుపుకొంటారు. కానీ దేవీ నవరాత్రులు, గణేష్ నవరాత్రులను మాత్రం బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి అట్టహాసంగా నిర్వహిస్తారు. దుర్గామాత మండపాలను కేవలం ఆయా కమిటీలు పూనుకుని చేస్తే.. గణేష్ ఉత్సవాల్లో మాత్రం పిల్లలు, పెద్దలు, ఆ ప్రాంతంలోని ప్రజలందరూ మమేకమై నిర్వహిస్తారు. అది తమ ఇంట్లో జరుగుతున్న కార్యక్రమంగా భావించి పనిచేస్తారు. ఒకనాడు ఇళ్లలో జరుపుకొన్న ఈ పండుగ బాలగంగాధర్ తిలక్ పుణ్యాన స్వాతంత్ర్య సమర వేదికగా మారి.. ఇళ్ల నుంచి ఆరుబయలు ప్రదేశాలకు తరలివచ్చింది. అప్పటినుంచీ ఏటేటా గణేష్ ఉత్సవ స్ఫూర్తి పెరుగుతూనే ఉంది. మండలపాల సంఖ్య ఏటికేడూ పెరుగుతూనే ఉంది. ఫలితంగా నవరాత్రుల నిర్వహణకు అవసరమైన వస్తుసామగ్రి కొనుగోళ్లు ఉత్సవాల సమయంలో పతాకస్థాయికి చేరుకుంటాయి. ఫలితంగా వ్యాపార రంగంతోపాటు సేవారంగం, హోటల్, క్యాటరింగ్, అలంకరణ, విద్యుత్, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, తదితర రంగాలకు చేతినిండా పని, జేబుల నిండా ఆదాయం లభిస్తుంది. ఏ పండుగకు లేని రీతిలో ప్రజలందరూ వినాయక ఉత్సవాలకు కనెక్ట్ కాగలగడమే దీనికి కారణం. దీనివల్ల కుటుంబాల పరంగా ఖర్చుతో కూడుకున్నదే అయినా.. సామాజికంగా చూస్తే ఆర్థిక రంగానికి బూస్ట్ ఇచ్చే పండుగగా వినాయక చవితిని వ్యాపార, ఆర్థిక రంగాల నిపుణులు పరిగణిస్తున్నారు.

### 20 లక్షలకుపైగా మండపాలు

కాలం మారుతున్నా గణేష్ ఉత్సవాల స్ఫూర్తి తగ్గకపోగా పెరుగుతోంది. ఆధునిక సొబగులు అద్దుకుంటోంది. ఈసారి కూడా ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. శనివారం వినాయక చవితి పర్వదినాన్ని దేశం యావత్తు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంది. ఆరోజు కొలువుదీరిన గణనాథులు తొమ్మిది రోజులపాటు భక్తుల పూజలు అందుకోనున్నాడు. ఈ తొమ్మిది రోజులూ పండుగ కోలాహలమే. రకరకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, నిమజ్జనోత్సవాలతో ఊరూవాడా కళకళలాడుతున్నాయి. వీటికి సమాంతరంగా దేశ ఆర్థికరంగం కూడా కొత్త ఉత్సాహం నింపుకుంటోందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్(క్యాట్) అంచనా వేస్తోంది. చైనీస్ వస్తువుల్ని పూర్తిగా పక్కన పెట్టేసి దేశీయ వస్తువులను వ్యాపారులు, కొనుగోలుదారులు ప్రోత్సహిస్తున్న విషయాన్ని వ్యాపార సంఘాలు గుర్తు చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా గణేష్ నవరాత్రులు ఉత్సాహంగా జరుగుతున్నా మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, గోవా రాష్ట్రాల్లో మాత్రం ఉత్సవాలు వేరే లెవల్లో జరుగుతాయి.. జరుగుతున్నాయన్నది వాస్తవం. ఒక అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా 20 లక్షలకుపైగా గణేష్ మండపాలు ఏర్పాటయ్యాయని సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బార్టియా అంచనా వేశారు. ఒక్క మహారాష్ట్రలోనే ఏడు లక్షలకు పైగా మండపాలను ఏర్పాటుచేయగా, ఆ తర్వాత అత్యధికంగా కర్ణాటకలో ఐదు లక్షలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మధ్యప్రదేశ్‌లో రెండు లక్షలు చొప్పున వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. దేశంలోని మిగతా రాష్ట్రాల్లోనూ వేల సంఖ్యలో మండపాలు కొలువుదీరాయి. ఈ మండపాల నిర్వహణ, ఉత్సవ కార్యక్రమాల రూపేణా భారీస్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్నాయని, దీనివల్ల ఆర్థిక రంగం కళకళలాడుతోందని క్యాట్ జాతీయ అధ్యక్షుడు బీసీ భారతీయ, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు.

### అనేక రంగాలకు ఊతం

ఉత్సవాలు భారీగా జరుగుతున్న రాష్ట్రాల్లో క్యాట్ నిర్వహించిన సర్వేలో ఖర్చులకు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 20 లక్షల మండపాలు ఏర్పాటయ్యాయనుకుంటే.. ఒక్కో మండప ఏర్పాటుకు కనీసం రూ.50 వేలు ఖర్చు అవుతుందనుకున్నా.. మొత్తం అన్ని మండపాలకు కలిపి రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. ఇక మండపాలు, ఇళ్లలో వినాయక విగ్రహాలు ప్రతిష్టించి పూజలు చేయడం సంప్రదాయం. ఆ విధంగా విగ్రహాల తయారీదారులకు రెండు మూడు నెలల ముందు నుంచే చేతి నిండా పని లభించింది. చిన్నా పెద్దా విగ్రహాల అమ్మకాల ద్వారా రూ.500 కోట్ల లావాదేవీలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. పూలు, దండలు, పండ్లు, కొబ్బరి, ధూపం, ఇతర పూజా సామాగ్రి విక్రయాల లావాదేవీలు ఇప్పటికే రూ.500 కోట్లకు చేరుకున్నాయి. ఈ తొమ్మిది రోజులూ ఇవి కొనసాగుతూనే ఉంటాయి. అలాగే స్వీట్లు, ప్రసాదాలు, ఇతర గృహావసరాలకు కలిపి రూ.రెండువేల కోట్లకుపైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. అన్నదానాలు, పెద్ద కుటుంబాలు నిర్వహించే విందు భోజనాల వల్ల క్యాటరింగ్, స్నాక్స్ వ్యాపారం రూ.మూడువేల కోట్ల వరకు జరుగుతుందని సర్వేలో అంచనా వేశారు. పండుగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ప్రయాణాలు, బట్టలు, కొత్త వస్తువుల కొనుగోళ్లు, మండపాల వద్ద తొమ్మిది రోజులపాటు నిర్వహించే సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలకు కలిపి రూ.5వేల కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయని అంటున్నారు. అదే సమయంలో ఈ రంగాల్లో లక్షలాదిమందికి ఉపాధి లభిస్తుంది. ఇవి కాకుండా పర్యాటకం, ట్రావెల్స్, హోటల్ రంగానికి కూడా డిమాండ్ నెలకొంది. ఈ రంగాల టర్నోవర్ రూ. రెండువేల కోట్లు దాటవచ్చని అంచనా. రిటైల్ వ్యాపారానికి సంబంధించి ఇళ్లు, మండపాల అలంకరణ, బహుమతి వస్తువుల అమ్మకాలు రూపంలో రూ. మూడువేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు. మండపాల వద్ద తొమ్మిది రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర ఈవెంట్ల రూపంలో సుమారు రూ. ఐదువేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు. మొత్తం మీద గణేషుడి పూజాఫలంగా పుణ్యంతో పాటు ఆర్థిక ఊతం కూడా లభించడం విశేషం.

## ఓబీసీ సాధించే వరకూ ఉద్యమిస్తాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శిష్టకరణాలు ఓబీసీ సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని రాష్ట్ర శిష్టకరణ సంఘం (63/79) అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇప్పటికే పలుమార్లు ఓబీసీ ప్రయత్నంలో భాగంగా ఢిల్లీ వెళ్ళామన్నారు. కార్యవర్గ సూచన మేరకు రాష్ట్రఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.జయబాబు, అడ్మిన్ కార్యదర్శి సదాశివుని క్రిష్ణ, బి.సుధాకర్, ప్రభాకర్‌దాస్, సత్యప్రసాద్, పీవీ టి.రమణారావు, పాత్రో, పావని, శర్మ శివప్రసాద్, ఎస్.లక్ష్మణరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.10లక్షల చెక్కును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం అందజేశారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## ఘనంగా ప్రారంభమైన జేసీఐ వారోత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేసీఐ వారోత్సవాల సందర్భంగా జెసిఐ శ్రీకాకుళం మెయిన్, జెసిఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీలు సంయుక్తంగా కార్యక్రమాలను సోమవారం స్థానిక చైతన్య సహకార నునియర్ కళాశాలలో ఘనంగా ప్రారంభించారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జెసిఐ వ్యవస్థాపకులు జెసి జామి భీమశంకర్, ప్రత్యేక అతిధి డా. పైడి సింధూరలు ముఖ్య అతిథులుగా హాజరై జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జెసిఐకు ఎనలేని సేవలందించిన అధ్యక్షులకు పేరు పేరునా అభినందనలన్నారు. సమాజంలో ఎదుగుదల, మంచి నాయకునిగా గుర్తింపు రావాలంటే జెసిఐలో సభ్యులుగా ఉండాలని, నేటి యువతకు జెసిఐ కార్యక్రమాలలో భాగసామ్యం చేయాలన్నారు. వారం రోజులపాటు జరిగే కార్యక్రమ వివరాలను అధ్యక్షులు కూన అనిల్ కుమార్, బెందాళం వరలక్ష్మిలు వివరించి, ప్రాజెక్ట్ చైర్మన్ బొడిగె మధు, తమ్మినేని ఉషారాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంటర్ నటుకుల.మోహన్, ఉమామహేశ్వరరావు, దూసి సంతోష్, ఆర్.శ్రీనివాసరావు, ఉర్లం శివతేజ, సాయికృష్ణ, జాడ సాయి, గణపతి, కె.ఉషారాణి, బాడాన.దేవభూషణం, మండవల్లి రవి, సాయి బాబా, పొడుగు చరణ్ ఇతర జెసి సభ్యులు పాల్గొన్నారు.



## స్మార్ట్‌ఇండియా హెకాటన్ 2024 న్యాయనిర్ణేతగా రతన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పంజాబ్, హర్యానా ఉమ్మడి రాజధాని చండీఘర్‌లోని చండీఘర్ యూనివర్సిటీలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన టెక్నోన్ 3.0 ఇంటర్నల్ హెకాటన్ స్మార్ట్ ఇండియా హెకాటన్ 2024కు న్యాయనిర్ణేతగా జిల్లాకు చెందిన బగాది జయప్రకాష్ లక్ష్మీరతన్ వ్యవహరించారు. దేశంలో బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఐటీ, సైబర్ సెక్యూరిటీలో ప్రతిభ కనబరిచిన నలుగురిని ఎంపికచేశారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన జెడిబి ఇన్ఫో టెక్ డైరెక్టర్ అక్షయ్ డెబాస్, మధ్యప్రదేశ్‌కి చెందిన ధైర్య జోషి, పంజాబ్‌కు చెందిన జెడిబి సీఈఓ సాగర్ సింగ్‌తో కలిసి న్యాయ నిర్ణేతగా ఎంపికైన నలుగురిలో జయప్రకాష్ ఒకరు కావడం విశేషం. శ్రీకాకుళం నగరం చిన్నబజార్‌కు చెందిన జయప్రకాష్ టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్‌లో ఐటీ గ్రాడ్యుయేషన్ ఇటీవల పూర్తిచేశారు. ప్రస్తుతం లియో గ్లోబల్ ఓవర్సీస్ (లండన్) డిజిటల్ మార్కెటింగ్ చీఫ్ అడ్వైజర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ, జెడిబి ఇన్ఫోటెక్ ఢిల్లీకి బిజినెస్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. వీటి ఆధారంగానే చండీఘర్ యూనివర్సిటీ న్యాయ నిర్ణేతగా ఎంపిక చేసింది. రెండు రోజుల పాటు చండీఘర్ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ బృందంతో కలిసి ఏఐ సంబంధిత నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇచ్చే సూచనలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బిజినెస్ సలహాలు అందించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ మొత్తం 600 బృందాలు నూతన ఆవిష్కరణలు ప్రదర్శించగా, అందులో 64 ఉత్తమ ఆవిష్కరణలను గుర్తించి తుది జాబితాలో 30 మాత్రమే ఎంపిక చేశారు. 30 ఆవిష్కరణలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఈ ప్రాసెస్‌కి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్టు తెలిపారు. జయప్రకాష్ ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, ఆదిత్య కాలేజీ అధ్యాపకులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.




## అలుపెరుగక.. విశ్రమించక..!

**సహాయక చర్యల్లో మంత్రి అచ్చెన్నాయుడు**
**వరదలు తగ్గడంలో పారిశుధ్య పనులు వేగవంతం**
**బుడమేరును సందర్శించిన మంత్రి అచ్చెన్న**



**అమరావతి:** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అలుపెరుగక విశ్రమించక వరద బాధిత ప్రాంతాలలో పర్యటిస్తూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. ప్రభుత్వం తరఫున చేపడుతున్న సహాయక చర్యల్లో పాల్గొంటూ, యంత్రాంగంలో ఉత్తేజాన్ని నింపుతూ, కొత్త స్ఫూర్తిని చాటుతున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సుడిగాలి పర్యటన చేపడుతున్నారు. వారం రోజులుగా విజయవాడలోనే ఉంటూ బాధిత ప్రాంతాల్లో బృంద పర్యటన చేస్తూ, తన తోటి మంత్రులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొని సూచనలు అందిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా బాధిత వర్గాలకు ఆహార పంపిణీ, పాలు, తాగునీటి సరఫరా చేపడుతున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. ఆయన వెంట మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పలువురు కూటమి నాయకులు, అధికారులు ఉన్నారు. ముంపు ప్రాంతాల్లో ఆటో, ద్విచక్ర వాహనంపై పర్యటించి, బాధితులలో భరోసా నింపారు. కొన్ని పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తక్షణమే మోటార్ల ద్వారా తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి అచ్చెన్న తెలిపారు. మరోవైపు వరద ముంపునకు ప్రధాన కారణమైన బుడమేరు గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చడం పూర్తి చేశామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం మేరకు సమర్థంగా యంత్రాంగం అంతా పనిచేస్తున్నారని అన్నారు. 45వ డివిజన్‌లో రామరాజు నగర్, కబేళా సెంటర్, పవర్ స్టేషన్ రోడ్డు, జోజి నగర్‌లో వరద నీటి నిల్వలు తొలగించేందుకు ఇప్పటివరకూ చేపట్టిన చర్యలపై అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వ హించారు. ముంపు ప్రాంతాల్లో మురుగు నీటిని తొలగించి తక్షణమే శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని నిర్దేశించారు.

## సరికొత్త సంప్రదాయానికి తెరతీసిన కలిశెట్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బంగాళాఖాతం సముద్రంలో తలెత్తిన వాయుగుండం ప్రభావాన్ని ఎదుర్కోవడానికి సంబంధించి మొట్టమొదటిసారిగా 24/7( రౌండ్ ది క్లాక్) కంట్రోల్ రూమ్‌ను తన కార్యాలయంలో ఏర్పాటు చేయడం ద్వారా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సరికొత్త సాంప్రదాయానికి తెర తీశారు. ఆదివారం బంగాళాఖాతంలో తలెత్తిన వాయుగుండంపై అప్రమత్తం అవ్వాలని సమాచారం వచ్చిన వెంటనే తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో వరద నివారణ సహాయక చర్యలు చేపట్టేందుకు సంబంధించి అప్పటికప్పుడు తన కార్యాలయంలో అప్పలనాయుడు కంట్రోల్‌రూమును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కలిశెట్టి బృందంతో కలిసి అప్పలనాయుడు తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. అర్ధరాత్రి సమయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లావేరు మండలం తామాడ పంచాయతీ రాయి నింగారిపేట గ్రామం సమీపంలోని పెద్దగెడ్డలో ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆదివారం రాత్రి వరద నీటితో ఉప్పొంగిన పెద్దగెడ్డను అప్పల నాయుడు సందర్శించారు. అనంతరం ఇదే రోజు అర్ధరాత్రి ఎచెర్ల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును సందర్శించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, స్పెషల్ ఆఫీసర్ చిట్టిబాబు, తహశీల్దార్ సింహాచలంలతో కలిసి తుఫాన్ ప్రభావిత గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.